క్లుప్తంగా

సబ్‌స్టేషన్‌లో ఫీడర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎస్‌ఈ గంగాధర్

భీమిని: విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ఫీడర్లను ప్రారంభిస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ గంగాధర్ అన్నారు. భీమిని మండలంలో బుధవారం సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కన్నెపల్లి మండలంలోని నాయకునిపేట సబ్‌స్టేషన్‌లో ఎస్‌ఎస్‌ఎచ్‌క్యూ ఫీడర్ బ్రేకర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ రాజన్న, ఏడీఈ రవికుమార్, ఏఈ రాజనర్సు, సబ్ ఇంజనీర్ రాహుల్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పూలే సినిమా విడుదల చేయాలి

పాతమంచిర్యాల: మహాత్మాజ్యోతి బా పూలే చరిత్రపై హిందీలో వస్తున్న పూలే సినిమా విడుదలకు అడ్డంకులు తొలగించి యధాతదంగా విడుదల చేయాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కే.మల్లయ్య, సామాజిక ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, నాయకులు కొండయ్య, మధు, ప్రభాకర్ పాల్గొన్నారు.

‘టెండరు వేయకుండా చర్యలు చేపట్టాలి’

భీమారం: మండల కేంద్రం సమీపంలోని గొల్లవాగులో చేపలు పట్టేందుకు టెండరు వేయకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ముదిరాజ్‌లు సుంకరి గోపాల్, దాసరి చంద్రమౌళి, సుంకరి వెంకటేశ్, దబ్బెట సంతోష్ జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. భీమారం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులకు మత్స్యపారిశ్రామిక సంఘంలో సభ్యత్వం ఉందని, అయితే మత్స్యకార్మిక సంఘం సభ్యులు ప్రాజెక్ట్‌లో చేపలు పట్టి వాటిని అమ్ముకొని ఉపాధి పొందాలని ప్రభుత్వం తెలుపగా, అందుకు విరుద్ధంగా సంఘం సభ్యుల్లో కొందరు టెండరు వేస్తున్నారని తెలిపారు. దీనిద్వారా తాము ఉపాధి కోల్పోతున్నట్లు వాపోయారు. ఉపాధికోసం చేపలు పట్టుటకు అనుమతివ్వాలని సంఘం సభ్యుల్లో కొందరు డిమాండ్ చేస్తుండగా, మరికొందరు మాత్రం టెండరు వేసి డబ్బులు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో కలెక్టర్ విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

ఇంటర్‌లో మంచిర్యాల విద్యార్థిని ప్రతిభ



మంచిర్యాలఅర్బన్: ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో మంచిర్యాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ చాటింది. పట్టణానికి చెందిన వ్యాపారి రావుల మహేశ్, మౌనిక దంపతుల ద్వితీయ కుమార్తె రావుల భవ్య ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ విభాగంలో 491/500మార్కులు సాధించి తెలంగాణలో 4వ స్థానంలో నిలిచింది. మంచిర్యాలలోని కార్మెల్ స్కూల్‌లో పదో తరగతిలో 95శాతం మార్కులు సాధించింది.

ఘనంగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్దిపల్లి, ముల్కల్లలో బుధవారం పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోతరాజుల ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతుల్లో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కనుల పండవగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విగ్రహ ప్రతిష్టలో పాల్గొని విరాళం అందజేశారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్యాలయం ఆవరణలో తడి, పొడి చెత్త అవగాహన పోస్టర్లను ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినులతో కలిసి అధికారులు, సిబ్బంది విడుదల చేశారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్‌పై పలు వార్డుల్లో, మార్కెట్ రోడ్ల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బి.రాజ్ కుమార్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు టి.ఉదయ్ కిరణ్, ఎం.వైకుంఠం, ఎం.శివరామకృష్ణ, జవాన్ ఎస్.రాజం, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గోదావరి నది తీరం ప్రమాదకరంగా ఉండటంతో ఈ నెల 21న ‘తీరం.. ప్రమాదాలకు నిలయం’ అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా, పోలీసులు స్పందించారు. పార్‌పల్లి, ఎర్రాయిపేట గోదావరి నది తీరంలో లోతైన ప్రదేశం.. ఇచ్చట స్నానాలు నిషేధమనే హెచ్చరికలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, నిఘాను ఏర్పాటు చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

ముందస్తు బడిబాట



దండేపల్లి: బడిబాట కార్యక్రమం అధికారికంగా యేటా జూన్, మొదటి లేదా రెండో వారంలో నిర్వహిస్తుంటారు. దండేపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో మాత్రం విద్యార్థుల చేరికలే లక్ష్యంగా అనధికారికంగా వార్షిక పరీక్షల అనంతరం ముందస్తు బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫ్లెక్సీలు, కరపత్రాలతో ప్రచారం చేస్తున్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బడి ప్రత్యేకతలను వివరిస్తున్నారు.

గొల్లవాగు ప్రాజెక్ట్ కట్టకు రివిట్‌మెంట్



భీమారం: గొల్లవాగు ప్రాజెక్ట్ కట్టకు ఏర్పాటు చేసిన రివిట్‌మెంట్ కొంత మేరకు దెబ్బతినగా కట్ట దృడంగా ఉండాలనే ఉద్దేశంతో ఆ ప్రాంతంలో రాళ్లు పేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు రూ.20లక్షలతో గ్యాప్ ప్రాంతంలో బండరాళ్లతో రివిట్‌మెంట్ చేయనున్నారు. బండరాళ్లని తెచ్చి కట్టపై ఉంచారు. ప్రాజెక్ట్ నిర్మించిన సమయంలో రాళ్లతో ఏర్పాటు చేసిన రివిట్‌మెంట్‌లో నీళ్ల కారణంగా కొంతగ్యాప్ వచ్చింది. అలాగే కొన్ని కొట్టుకుపోయాయి.

కొవ్వొత్తుల ర్యాలీ

దండేపల్లి/తాండూర్/పాతమంచిర్యాల/చెన్నూర్/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియచేశారు. అమాయక ప్రజలను ఉగ్రవాదులు కాల్చిచంపటం బాధాకర మన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఒక్కటి కావాలని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల శాఖ అధ్యక్షుడు బాలమోహన్, ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్, రామకృష్ణాపూర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు ఆరుముళ్ల పోషం, ధన్‌సింగ్, వేముల అశోక్, వైద్య శ్రీనివాస్, రాంకిషోర్, దండేపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య, తాండూర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, చెన్నూర్‌లో బీజేపీ నాయకులు తుమ్మ శ్రీపాల్, మందమర్రిలో ప్రెస్‌క్లబ్ సభ్యులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

కశ్మీర్ ఉగ్రదాడిపై ఖండన

శ్రీరాంపూర్: జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగ్, జిల్లా అధ్యక్షుడు తలారి రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు బింగి సదానందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశం ఓ ముద్దు బిడ్డను కోల్పోయిందన్నారు.



మందమర్రిలో...



తాండూర్: కొవ్వొత్తులతో ర్యాలీ



చెన్నూర్: బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



దండేపల్లిలో...

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూర్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జలాల్ పెట్రోల్‌బంక్ వద్ద బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించేందుకు డ్రోన్ కెమెరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఖాళీ స్థలాల్లో మద్యం సేవించడాన్ని నివారించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ దేవేందర్ రావు, ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరాతో పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

గంజాయి కేసు.. ముగ్గురు అరెస్ట్

మంచిర్యాలక్రైం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల నమోదైన గంజాయి కేసులో పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు యువకులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాల వ్యాపారం ముసుగులో కొనసాగుతున్న గంజాయి దందాను ఈ ఏడాది ఫిబ్రవరి 20న పోలీసులు గుట్టు రట్టు చేశారు. 23.5 కిలోల గంజాయితో పాటు 11 మందిని అరెస్ట్ చేయగా మరో 11మంది పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న వారిలో ముగ్గురు యువకులు స్థానిక శ్రీశ్రీనగర్‌కు చెందిన మాసు శ్రీకర్, రాజీవ్‌నగర్‌కు చెందిన సాగే పవన్, నస్పూర్ సింగాపూర్ ప్లాట్స్‌కు చెందిన తోట నితీశ్‌లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ ప్రమోద్‌రావు

కొనుగోళ్ల జాప్యంపై నిలదీత

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ గ్రామంలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై సీసీ కొమురవెల్లిని రైతులు బుధవారం నిలదీశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ధాన్యం కుప్పలు పోసి 20రోజులు దాటినా, కాంటా వేయడం లేదని ఆరోపించారు. ముందు పోసిన వాటిని పక్కన పెట్టి, తరువాత కుప్పలు పోసిన వాటిని కాంటా వేస్తున్నారని మండిపడ్డారు. వరుస నంబర్లు ఇవ్వకుండా ఇష్టం వచ్చినట్లు కాంటా వేస్తున్నారని, పైగా గన్నీ సంచులు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియడం లేదన్నారు. ఈ విషయంపై సీసీ కొమురవెల్లి మాట్లాడుతూ.. ప్రస్తుతం రెండు సెంటర్లకు కలిపి నాలుగు కాంటాలు నడుస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి హమాలీలను రప్పించి, అదనంగా మరో నాలుగు కాంటాలు ఏర్పాటు చేయించి, కొనుగోళ్లను వేగవతం చేస్తామని రైతులకు నచ్చజెప్పారు.



సీసీని నిలదీస్తున్న రైతులు

వాహనం ఢీకొట్టి యువకుడి మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని సంజీవయ్య కాలనీలో నివాసం ఉంటున్న తాడూరి నరేశ్(38) అనే యువకుడు మంగళవారం కాగజ్‌నగర్‌లో ఉన్న బంధువుల ఇంటికి కాలినడకన బయల్దేరాడు. బెల్లంపల్లి శివారు బైపాస్ రోడ్డు మీదుగా తాండూర్ వైపునకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి నరేశ్ మృతి చెందాడు. బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి తల్లి విజయలలిత ఉండగా తండ్రి కొన్నాళ్ల క్రితం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలల్లో గ్రాడ్యుయేషన్ డే

చెన్నూర్/తాండూర్/నెన్నెల/మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్‌లోని బాబర్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ పట్టణంలోని రైజింగ్ సన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో, నెన్నెల హైస్కూల్లో, తాండూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబర్‌నగర్ పాఠశాలకు మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి, రైజింగ్ సన్ పాఠశాలకు చెన్నూర్ సీఐ దేవేందర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందించారు. నెన్నెలలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, గంగారాం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సాయిబాబా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని కరపత్రాలను విడుదల చేశారు.

ప్రతీ పేరెంట్ రెండు అడ్మిషన్లు చేయించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈవో మాళవీదేవి

మంచిర్యాలఅర్బన్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలున్నాయని, వచ్చే విద్యాసంవత్సరానికి ప్రతీ పేరెంట్ రెండు అడ్మిషన్లు చేయించాలని మంచిర్యాల ఎంఈవో మాళవీదేవి అన్నారు. మంచిర్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడళ్లు బహూకరించారు. సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్, కిరణ్, సుమతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి

జైపూర్: మండలంలోని టేకుమట్ల గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్ ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నడిపల్లి సత్యనారాయణరావు, పాత ప్రశాంత్, రమేశ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరగా చెల్లించాలి

శ్రీరాంపూర్: కార్మికుల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను త్వరగా చెల్లించాలని ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆధార్‌తో పాన్‌కార్డు లింకు లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఉద్యోగుల ఇన్‌కమ్‌ట్యాక్స్ సమస్యలపై, మెడికల్ బకాయిలు, క్లైయిమ్‌లపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్స్) భీబత్స, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, అకౌంట్స్ అధికారి పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, పాల్గొన్న అధికారులు

ఖాళీలను భర్తీ చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇచ్చిన వాటికి పరీక్షలు నిర్వహించి, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని హెచ్‌ఎమ్మెస్ కేంద్ర కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీలో 360జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఎమ్మెల్సీ ఎన్నికల పేరుతో వాటిని నిలిపేశారని, వెంటనే వాటి భర్తీ ప్రక్రియను కొనసాగించాలన్నారు. ఎంపీ డ్రైవర్, ఈపీ ఆపరేటర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

కొత్త గనుల కోసం కృషి

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఆర్కే 6 గనిని బుధవారం ఆయన సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క గనిని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. దాని ప్రభావం వల్లే నేడు సింగరేణి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త గనుల ఏర్పాటు కోసం కృషి చేస్తుందని తెలిపారు. సింగరేణి పరిరక్షణే ధ్యేయంగా ఐఎన్టీయూసీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, నాయకులు సంతోష్, ప్రవీణ్, సత్యనారాయణ, బొడ్డు ప్రభాకర్ తిరుపతి పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

సంక్షిప్త వార్తలు

- **దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మే 20న జరిగే దేశవ్యాప్తను జయప్రదం చేయాలని గుడిపేట లిక్కర్ హమాలీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. హాజీపూర్ మండలం గుడిపేటలోని లిక్కర్ గోదాము వద్ద బుధవారం హమాలీ కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమై దేశవ్యాప్త సమ్మె ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. సమ్మె విజయవంతానికి ఈ నెల 27వ తేదీ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించే కార్మిక సంఘాల జిల్లా సదస్సులో కార్మికులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నట్లు తెలిపారు.

- **మేడే పోస్టర్ ఆవిష్కరణ**

మంచిర్యాలటౌన్: మే 1న జరపబడే 139వ మేడే పోస్టర్లను బుధవారం మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మేడే రోజున మంచిర్యాల నగర పాలక సంస్థ ఆవరణలో బహిరంగ సభను నిర్వహించనున్నట్లు, కార్మిక సంఘ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కార్మికులు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, నాయకులు గోపాల్, వెంకటి, కోకిల శ్రీనివాస్, బి. రత్నం, మల్లేశ్, సత్తయ్య, రాజేందర్, శ్రీను పాల్గొన్నారు.

- **ఎంసీహెచ్‌లో పండ్లు, మజ్జిగ పంపిణీ**

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు బుధవారం లయన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో ప్రోగ్రాం చైర్‌పర్సన్ వి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్, సభ్యులు ఎం.రామాంజనేయులు, కొత్త సురేందర్, గుండా శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ**

జన్నారం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అర్హులైన 23 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఫసీఉల్లా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు శంకరయ్య, ఇందయ్య తదితరులు పాల్గొన్నారు.

- **‘టీడీపీ బలోపేతం కోసం కమిటీలు’**

భీమారం: తెలంగాణలోని అన్ని జిల్లాల్లో తెలుగు దేశం పార్టీని బలోపేతం చేసేందుకు మండల కమిటీలు వేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాసాల సంపత్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం కమిటీ ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించారు. నాయకులు ఆర్కె జయప్రద, జూపాక సంధ్య తదితరులు పాల్గొన్నారు.

- **పదోన్నతి పొందిన ఎస్సైకి సన్మానం**

బెల్లంపల్లి: ఏఎస్ఐ నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన సయ్యద్‌మాజిరొద్దీన్‌కు ఆత్మీయ సన్మానం జరిగింది. బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం సీఐ అఫ్జలుద్దీన్, తాళ్ల గురిజాల ఎస్సై సీ.హెచ్.రమేశ్ శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

- **ఆర్థిక సాయం**

పాతమంచిర్యాల: జిల్లాలోని భీమారం మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న కట్ల మల్లేష్ ఈ నెల 13న అనారోగ్యంతో మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో నివాసముంటున్న ఆయన భార్య భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులకు బుధవారం జిల్లా ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్‌ల సంఘం నాయకులు రూ.10,500, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం నాయకులు రూ.20వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు.

- **కాంగ్రెస్‌లో చేరిన మాజీ జెడ్పీటీసీ**

భీమిని: కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితులై ఉమ్మడి భీమిని మాజీ జెడ్పీటీసీ అల్లి మోహన్ బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్‌లో మాజీ జెడ్పీటీసీ మోహన్, యువ నాయకుడు అల్లి మహేశ్‌లకు బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాదవరపు నర్సింగారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

- **వడదెబ్బ నివారణపై అవగాహన**

దండేపల్లి: వడదెబ్బ నివారణ చర్యలపై బుధవారం మండల స్థాయి అధికారుల అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, తాళ్లపేట పీహెచ్‌సీ డాక్టర్ క్రాంతికుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- **డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం**

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంగ్ల భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎంపీ.పట్వర్ధన్, ఆంగ్ల అధ్యాపకుడు రామకృష్ణ, లైబ్రేరియన్ కృష్ణగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

27న వైద్య శిబిరం

తాండూర్: మండలంలోని నర్సాపూర్‌లో 27న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాదారం ఎస్సై సౌజన్య తెలిపారు. నీలయపల్లె, ఎంవీకే 3 ఇంక్లైన్, మాదారం గ్రామ పంచాయతీల ప్రజల కోసం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.